ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 17 జూన్ 2024



పెందుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా!

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

- సుజల స్రవంతి, చెరకు రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్

- 5లో

రుషికొండపై ఇంద్ర భవనాన్ని మీడియాకు చూపించిన ఎమ్మెల్యే గంటా



కళ్లు చెదిరే నిర్మాణాలతో అవాక్కైన జనం

వీడిన రాజకోట రహస్యం



రుషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనాలు

- అడుగడుగునా అత్యాధునికత ఉట్టిపడేలా సామగ్రి
- ఫ్యాన్ నుంచి బాత్రూమ్ కమోడ్ వరకు ఖరీదైనవే
- ఏడు బ్లాకుల్లో సాగిన నిర్మాణాలు
- ఒక్కో బ్లాక్‌కు రూ.కోట్లలో వ్యయం
- అద్దగోలు భవనంలో ఎన్నెన్నో విచిత్రాలు



ప్యాలెస్‌లో సువిశాలమైన హాల్

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మోజుపడి, నిబంధనలను తోసి రాజని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ గుట్టు వీడింది. రాజమహల్‌ను తలదన్నే రీతిలో అత్యాధునిక హంగులు, ఆర్భాటాలతో ఏడు బ్లాకుల్లో నిబంధనలకు విరుద్ధంగా, కోర్టులను బురిడీ కొట్టించి మరీ సాగించిన నిర్మాణాలను భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రజలకు ... మిగతా 5వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి అనిత

మహిళా భద్రతకు పెద్దపీట

పరస్పర సహకారంతో కలిసి పనిచేద్దాం

- ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే ఉపేక్షించేది లేదు
- అధికారులతో హోం శాఖ మంత్రి అనిత

అనకాపల్లిటౌన్, జూన్ 16: మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. స్థానిక ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన పరిచయ వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరస్పర సహకారంతో అందరం కలిసి పని చేద్దామని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే ఉపేక్షించేది లేదని ఆమె స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత భవనాలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతూ పని చేశారన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సూచించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎన్నో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇరిగేషన్ పనులు జరగక నీరంతా సముద్రంలో కలిసిపోతుందన్నారు. గ్రోయిన్లు లేకపోవడం, దెబ్బతినడం వల్ల వ్యవసాయానికి సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎక్కడ గంజాయి దొరికినా ఉమ్మడి విశాఖ జిల్లా వైపే అందరూ వేలెత్తి చూపిస్తున్నారని తెలిపారు. గంజాయి రవాణా అరికట్టేందుకు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. హోం మంత్రిగా నియమితులైన వెంటనే మహిళల అదృశ్యంపై చాలా మంది ఫోన్లు చేయడంతో పాటు మెసేజ్‌లు చేశారన్నారు. వీటిపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలపై చర్యలు తీసుకోవడానికి ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను నియంత్రించాల్సిన ... మిగతా 6వ పేజీలో

అనిత నివాసం వద్ద కోలాహలం



తన నివాసం వద్ద పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూన్ 16: రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత నివాసం ఆదివారం సందడిగా కనిపించింది. ఉదయం 10 గంటల వరకు ఆమె నక్కపల్లికి సమీపంలో తన నివాసం వద్ద అందుబాటులో ఉండడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని ఆమె స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వేద పండితుల బృందం ఆమెకు వేద ఆశీర్వచనం చేశారు. అంగన్‌వాడీ అసోసియేషన్ సంఘ స్థానిక ప్రతినిధులు దుర్గారాణి, సుబ్బలక్ష్మి, రమణమ్మ తదితరులు ఆమెకు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

పల్లాకు పట్టాభిషేకం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు
- విశాఖ జిల్లాకు పెద్దపీట
- ఉత్తరాంధ్ర నుంచి మూడో వ్యక్తికి పార్టీలో కీలక పదవి



విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత పార్టీ పదవి నుంచి వైదొలిగారు. ఈ నేపథ్యంలో ఆ పదవిలో పల్లా శ్రీనివాసరావును నియమించాలని అధినేత చంద్రబాబు మూడు రోజుల క్రితమే నిర్ణయించి, ఆ విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే ఆదివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

తాజా ఎన్నికల్లో రాష్ట్రంలోనే గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావుకు మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. పదవుల పంపకంలో సమీకరణల నేపథ్యంలో పల్లాకు మంత్రి పదవి రాలేదు. ఈ నేపథ్యంలో పార్టీలో అత్యున్నతమైన రాష్ట్ర అధ్యక్ష పదవిని అధినేత కట్టబెట్టారు. వెనుకబడిన యాదవ సామాజికవర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావు కుటుంబం తెలుగుదేశం పార్టీలో ఉంది. పల్లా తండ్రి సింహాచలం 1994లో విశాఖ-2 నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పల్లా శ్రీనివాసరావు 2020 నుంచి విశాఖ పార్లమెంటు అధ్యక్షునిగా సుమారు నాలుగేళ్ల పనిచేశారు. ఇదిలావుండగా ఉత్తరాంధ్ర నుంచి కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి వరించిన మూడో వ్యక్తి పల్లా శ్రీనివాసరావే. ఈ ముగ్గురు కూడా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కావడం గమనార్హం.

విత్తన గిడ్డంగి ప్రాజెక్టుకు మంచి రోజులు!

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థలం కేటాయింపు

- వైసీపీ పాలనలో పునాదులకే పరిమితం
- రైతాంగం విత్తన అవసరాలపై అంతులేని నిర్లక్ష్యం
- ఇప్పటికీ విత్తనాల కోసం పొరుగు జిల్లా వైపే చూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో చిగురించిన ఆశలు



గంధవరంలో పునాది స్థాయిలోనే నిలిచిన విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం

చోడవరం, జూన్ 16: జిల్లాలో రైతాంగానికి అవసరమైన విత్తనాల నిల్వ కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రానికి మంచిరోజులు రానున్నాయి. ఐదేళ్లుగా పునాదులకే పరిమితమైన ఈ ప్రాజెక్టుకు ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో మహర్దశ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న శిలా ఫలకం

ఉమ్మడి విశాఖ జిల్లాలో రైతాంగం అవసరాల కోసం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రాన్ని మంజూరు చేసింది. దీనికి 2019లో అధికారులు మండలంలోని గంధవరం వద్ద స్థల పరిశీలన చేసి గిడ్డంగికి అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ తరువాత రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2020 జూలై నెలలో ఈ విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రానికి నాటి వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు, మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన ఏడాది కాలంలోనే దీనిని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తామని వారు ప్రకటించారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ గిడ్డంగి పునాదుల స్థాయి నుంచి అంగుళం కూడా కదల్లేదు. దీనికి అవసరమైన నిధులు పక్కదారి పట్టడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదు. దీనితో పునాదుల స్థాయిలోనే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఈ ప్రాజెక్టును అధికార పార్టీ నేతలు కూడా పట్టించుకోకపోవడంతో ఇది దిష్టిబొమ్మలా మిగిలిపోయింది.

అందుబాటులోకి వస్తే ఎంతో మేలు

గంధవరంలో ఈ విత్తన గిడ్డంగి ఏర్పాటయితే ఉమ్మడి జిల్లా రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడేది. ఇప్పటికీ వ్యవసాయ సీజన్‌లో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని రైతులకు అవసరమైన విత్తనాలు విజయగరం జిల్లాలోని విత్తన గిడ్డంగి నుంచే సరఫరా అవుతున్నాయి. గంధవరంలో 40 వేల క్వింటాళ్ల సామర్థ్యం కలిగిన ఈ విత్తన శుద్ధి కేంద్రం పూర్తయితే అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లోని రైతాంగానికి ఇక్కడ నుంచే విత్తనాలు సరఫరా చేయడానికి అవకాశం ఉండేది. మూడు జిల్లాలకు కూడా అందుబాటులో ఉండేది. విత్తనాల రవాణా ఖర్చులు కూడా తగ్గి ఉండేవి. స్థానిక రైతాంగానికి కూడా అవసరమైన రకాల విత్తనాలు పుష్కలంగా లభించడానికి వీలుండేది. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం దీని నిర్మాణానికి నిధుల కేటాయింపులు నిలిపివేయడంతో ఈ విత్తన గిడ్డంగి, శుద్ధి కేంద్రం రైతులకు అందుబాటులో లేకుండాపోయింది. రాష్ట్రంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో టీడీపీ హయాంలో మంజూరైన ఈ ప్రాజెక్టుకు మహర్దశ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలల దందా!

నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల ఆవరణలో పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయం

- ఇష్టానుసారంగా ఫీజులు వసూలు



ప్రైవేటు స్కూల్ గోదాములో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో (ఫైల్)

నర్సీపట్నం, జూన్ 16: ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను ఇష్టానుసారంగా పెంచడంతో పాటు పుస్తకాలను కూడా తమ వద్దే తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల ఆవరణలో పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు విక్రయించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

నర్సీపట్నంలో 42 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదని తెలిసింది. పుస్తకాలను ఎల్‌కేజీకి రూ.3,900, యూకేజీకి రూ.4 వేలు, ఫస్ట్ క్లాస్‌కు రూ.5 వేలు, రెండో తరగతికి రూ.5,200, మూడో తరగతికి రూ.5,400, నాలుగో తరగతికి రూ.5,600 నుంచి రూ.6,000కు విక్రయిస్తున్నారు. ఐదో తరగతికి రూ.5,700 నుంచి రూ.6,100 చొప్పున, అలాగే పదో తరగతికి వచ్చే సరికి రూ.9,500కి పుస్తకాలు అమ్ముతున్నారు. స్కూల్ డ్రెస్ క్లాత్‌కి (రెండు జతలు)కి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు తీసుకుంటున్నారు. విద్యార్థి వయస్సు పెరిగే కొద్ది క్లాత్ రేటు పెరుగుతుంది.

ఎంఈవోకి బెదిరింపులు

ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాలు విక్రయిస్తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని నర్సీపట్నం ఎంఈవో తలుపులుకు ఫిర్యాదు అందడంతో ఆయన మూడు రోజుల క్రితం పట్టణంలోని ... మిగతా 6వ పేజీలో

దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

నకిలీ ఎల్‌పీసీలతో విక్రయాలు

- బరి తెగించిన అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

సబ్బవరం, జూన్ 16: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వెదుళ్ల నరవ గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించి దర్జాగా ప్రహరీ గోడలు నిర్మించేస్తున్నారు. వాటిని ప్లాట్లుకు విభజించి విక్రయించేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

వెదుళ్ల నరవ సర్వే నంబరు 113లో ప్రభుత్వ భూమి 1.85 ఎకరాలు ఉంది. ఇది గెడ్డ, అయితే కొంత స్థలానికి నకిలీ ఎల్‌పీసీ(ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్)లు సృష్టించి స్థానిక నేతల సహకారంతో కొంత మంది అమ్మేస్తుంటే, మరి కొంత స్థలంలో ప్లాట్లు వేసి పక్కా జిరాయితీ నంబరుతో సెంటు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు దర్జాగా విక్రయించేస్తున్నారు. అదే విధంగా సర్వే నంబర్లు 117, 116లలో ప్రభుత్వ భూములను స్థానిక నేతలు యథేచ్ఛగా ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మించి అమ్మకానికి సిద్ధం చేశారు. కాగా సర్వే నంబరు 121లోని ప్రభుత్వ స్థలంలో ఇటీవల పక్కా భవనం నిర్మిస్తుంటే ఫిర్యాదు చేసినా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వెదుళ్ల నరవ సర్వే నంబరు 117లో ప్రభుత్వ భూమి కబ్జా చేసి ప్రహరీ నిర్మించిన దృశ్యం

పెండింగ్ పనులు
అంచనాలు తయారు చేయండి

» ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు


సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 16: నియోజకవర్గంలో చేయాల్సిన పెండింగ్ పనులు ఏమైనా ఉంటే త్వరగతిన అంచనాలు తయారు చేయించాలని మాజీ మంత్రి, నర్సీపట్నం నుంచి ఎమ్మె ల్యేగా గెలిచిన అయ్యన్నపాత్రుడు సూచించారు. ఆదివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్నప్రాతుడు మాట్లాడుతూ.. పార్టీలో పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యమిస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో అందరూ కష్టపడి పని చేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మెజార్టీలు చదివి వినిపించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో మెజార్టీ తగ్గిందని, ఎందుకు జరిగిందో సమీక్షించుకోవాలని అన్నారు. నర్సీపట్నం మండలం, మునిసిపాలిటీలో పెండింగ్ పనులు అంచనాలు తయారు చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అన్న క్యాంటీన్ భవనం త్వరగా సిద్ధం చేయాలని ఆర్డీవో జయరాంతో అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుకల రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు లాలం శ్రీరంగ స్వామి, టీడీపీ నాతవరం మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ జాలమూరి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ సందర్శించిన ఆర్డీవో

నర్సీపట్నం రెవెన్యూ డివిజినల్ అధికారి హెచ్‌వీ జయరాం స్థానిక అన్న క్యాంటీన్ భవనాన్ని మునిసిపల్ డీఈఈ నారాయణతో కలిసి పరిశీలించారు. త్వరగతిన పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెందుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా!

» యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
» సుజల స్రవంతి, చెరకు రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
» కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ సీఎం రమేష్


ఎంపీ రమేష్‌ను సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

సబ్బవరం, జూన్ 16 : అనకాపల్లి జిల్లాలోనే తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించిన పెందుర్తి నియోజకవర్గానికి అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇచ్చి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఇరువాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కూటమి నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో తనను ఆదరించిన ప్రజలకు, కార్యకర్తలకు, నేతలకు అందుబాటులో ఉంటానన్నారు. స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకుంటానని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాకారానికి, చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. దేశంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు ప్రారంభమైనా ఏపీలో కూడా అది ఉండేలా తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ తప్పులు మనం చేయకుండా, రౌడీ మూకలను తొక్కిపెడదామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ పెందుర్తి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. మూడు రాజధానుల సీఎంకు ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు. కేంద్రంతో మాట్లాడి పెట్రో వర్సిటీకి నిధులు తేవాలని, సబ్బవరంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నందున పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని ఆయన కోరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకూ ఉన్న రూరల్ మండలాలను వీఎంఆర్‌డీఏలో విలీనం చేసేలా కృషి చేయాలన్నారు. దీని వలన ఆయా మండలాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ పెందుర్తి ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, జనసేన సబ్బవరం కన్వీనర్ కర్రి కనకరాజు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, కూటమి నేతలు ఎం.మహాలక్ష్మీనాయుడు, భరణికాన బాబూరావు, బలిరెడ్డి అప్పారావు, గండి దేముడు, ముత్యాలనాయుడు, శరగడం రాము, బంతికోళ్ల పద్మ, గొర్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన మంత్రి అనిత


అనితను పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్


అనితకు చిత్రపటాన్ని అందిస్తున్న కొణతాల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

కొత్తూరు, జూన్ 16 : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం ఇక్కడ మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాలను కలిసి ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కొణతాల ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. అలాగే, అనకాపల్లి జాతీయ రహదారి వద్ద ఉన్న బీజేపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ సీఎం రమేష్‌ను మంత్రి అనిత కలిసి ఆశీర్వాదం పొందారు. ఆమెకు సీఎం రమేష్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. మంత్రి వర్గంలో అత్యంత కీలకమైన శాఖ బాధ్యతలు స్వీకరించిన అనితకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతరకు సకల ఏర్పాట్లు

» 18న అంగరంగ వైభవంగా అమ్మవారి పండుగ
» గ్రామంలో విద్యుత్ వెలుగులు, కటౌట్లు
» అదనపు బస్సు సర్వీసులు, పటిష్ట పోలీసు బందోబస్తు



మాడుగుల, జూన్ 16 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల ప్రాంత ప్రజల ఇలవేల్పు భక్తుల కొంగుబంగారమైన మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం జూన్ 18న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ స్థాయిలో విద్యుద్దీకరణ చేపట్టారు. మాడుగుల మోదకొండమ్మ ఆలయం నుంచి మొదలుకొని శతకంపట్టు వరకు, చోడవరం రోడ్డులో గల వెంకటేశ్వర స్వామి ఆలయం, మోదమాంబ కాలనీ, దాసరివీధి, జగ్గన్న చావడి పురవీధుల్లో భారీ విద్యుద్దీప అలంకరణ చేశారు. ప్రధాన కూడళ్లలో భారీ విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. దీంతో మాడుగుల కేంద్రంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా కమిటీ చర్యలు తీసుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి పండుగ నేపథ్యంలో రెండు రోజుల కిందట మాడుగుల ఎమ్మెల్యేగా గెలిచిన బండారు సత్యనారాయణ మూర్తి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక బస్సులు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలంటూ సూచించారు.

పండుగ కార్యక్రమాలు..

అమ్మవారి జాతర సందర్భంగా ఈ నెల పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 17వ తేదీన డ్యాన్స్ మస్తీ డాన్స్, 18న శతకంపట్టు వద్ద డ్యాన్స్ హంగామా, ఎన్టీఆర్ కళాక్షేత్రం స్టేజ్ వద్ద డ్యాన్స్-2024, జగ్గన్న చావిడి వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జవ్వాదిగెడ్డ జంక్షన్ వద్ద సినీ నృత్యప్రదర్శన, దాసరివీధిలో సూపర్ డూపర్ డ్యాన్స్, గవరవీధిలో డ్యాన్స్ మస్తీ, రావిచెట్టు జంక్షన్‌లో డ్యాన్స్ ఉత్సవ్, జవ్వాదిగెడ్డ జంక్షన్ వద్ద తోలుబొమ్మలాట, అదేరోజు రాత్రి 7 గంటల నుంచి దసరా స్టేజీపై వీరాభిమన్యు, భక్త చింతామణి, శ్రీకృష్ణ రాయబారం బుర్రకథ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఫ్లయింగ్ హనుమాన్ డ్రోన్ ద్వారా గ్రామంలో తిప్పుతారు. సింహాద్రి తీన్‌మార్ నిర్వహిస్తారు.

గోవాడ షుగర్స్ అభివృద్ధిపై త్వరలో అఖిలపక్ష సమావేశం

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


కేఎస్ఎన్ఎస్ రాజును కలిసిన గోవాడ షుగర్స్ కార్మికులు

చోడవరం, జూన్ 16: గోవాడ షుగర్స్ సమస్యల పరిష్కారంతో పాటు ఫ్యాక్టరీ అభివృద్ధికి అఖిలపక్షం సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యేగా గెలిచిన కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఆదివారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో కేఎస్ఎన్ఎస్ రాజును కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ త్వరలోనే ఫ్యాక్టరీపై రైతుల్లో నమ్మకం పెంచేలా ఫ్యాక్టరీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్షం సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీని ఆదుకోవడంతో పాటు పూర్వవైభవం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అల్లం రామప్పారావు, తలారి సత్యనారాయణ, ఏడువాక నారాయణరావు, హరిహరరావు, శ్యాం,సంతోష్, రామకృష్ణరాజు, దుస్సు రమణ,, వసాది రమణ, పెంటారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన గణేష్ గాయత్రి బ్రాహ్మణసేవాసంఘం సభ్యులు స్థానిక గణేష్ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం నేతులు మర్యాదపూర్వకంగా కేఎస్ఎన్ఎస్ రాజును కలిసి అభినందనలు తెలిపారు. రాజును కలిసిన వారిలో ఎం.వీరన్నపంతులు, కందర్ప రమణమూర్తి, మూర్తి, విస్సు ఉపాధ్యాయుల శ్రీనివాస్, కందర్ప రామేశం, చలపతిరావు ఉన్నారు.


ప్యాలెస్‌లోకి ప్రవేశిస్తున్న ఎమ్మెల్యే గంటా, తదితరులు


విద్యుత్ కాంతుల నడుమ విశాలవంతమైన గదులు

వీడిన రాజకోట రహస్యం

... 3వ పేజీ తరువాయి

చూపించే ప్రయత్నం చేశారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని మరీ ప్యాలెస్‌కు వెళ్లిన గంటా.. ఏడు బ్లాకుల్లో నిర్మితమైన భవనాల్లోని అనువణువును బయట ప్రపంచానికి బహిర్గతం చేశారు. తానో నిరుపేదను అన్నట్టుగా కలరింగ్ ఇచ్చే జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత విలాసవంతంగా ప్రజాధనంతో నిర్మించిన రాజమహల్‌లోని బాత్రూమ్ కూడా సాధారణ ప్రజలు నివసించే ఇంటికి రెండింతలు ఉండడం గమనార్హం.

మూడేళ్లుగా నిర్మాణం

గడిచిన మూడేళ్లుగా సాగుతున్న ఈ భవన నిర్మాణం గురించి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ నిర్మాణంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అధికారిక ప్రకటన చేయలేదు. ఒక్కోసారి ఒక్కో రీతిన ప్రకటనలు జారీచేసినా.. వాటిలో ఏది నిజమో ఇప్పటికీ తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు కొద్దిరోజులు ముందు అప్పటి పర్యాటకశాఖ మంత్రి రోజా హడావిడిగా ఈ భవనాలను ప్రారంభించి వెళ్లిపోయారు. అయితే, దీనిని దేనికి వినియోగిస్తారన్న విషయం మాత్రం చెప్పలేదు.

అంతర్జాతీయస్థాయిలో...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుషికొండపై నిర్మించిన రాజమహల్ గుట్టును గంటా బయటపెట్టారు. రూ.500 కోట్ల వ్యయంతో ఏడు బ్లాకుల్లో రుషికొండపై అత్యంత విలాసవంతంగా జగన్ నిర్మించుకున్న భవనాన్ని ఆసాంతం పరిశీలించారు. ఇందులోని ప్రతి వస్తువు అత్యంత ఖరీదైనదే. బాత్రూమ్ నుంచి బెడ్రూమ్ వరకు, హాల్ నుంచి కిచెన్ వరకు.. ప్రతిచోటా వినియోగించిన సామగ్రి, ఫర్నిచర్ కళ్లు చెదిరే రీతిలో ఉన్నాయి. ఇటాలియన్ మార్బుల్ గోడలు, ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌తో బాత్రూమ్ ఫిటింగ్స్, ఒళ్లు పట్టించుకోవడానికి మసాజ్ (స్పా)


ప్యాలెస్‌లోని మసాజ్ టేబుల్, బాత్‌రూమ్స్

రూములు, భారీ సైజు పడక గదులు, విశాలమైన కారిడార్లు.. ఇలా చెప్పుకుంటూపోతే ఇంద్ర భవనాన్ని తలపించేలా రీతిలో వసతులను ఏర్పాటు చేయించారు. వందలాది మందితో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా కాన్ఫరెన్స్ హాళ్లు, ఫైళ్ల భద్రపరిచేందుకు లాకర్లు ఏర్పాటు చేశారు. ఏడు బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టగా, వీటన్నింటినీ సొంతానికి వినియోగించుకునేలా డిజైన్ చేయడం గమనార్హం. ఆయా బ్లాకులకు పెట్టిన పేర్లు కూడా రాచరిక వ్యవస్థను గుర్తుచేసేలా ఉండడం మరో విశేషం. భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిచేశారు. ఈ దృశ్యాలను టీవీలు, సోషల్ మీడియాలో చూసిన ప్రజలు అవాక్కయ్యారు. ప్రజల డబ్బుతో జగన్ తన స్వార్థం కోసం ఇంతటి భవనం నిర్మించుకున్నారనే విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

రాళ్లు తేలిన రహదారిపై ఇక్కట్లు

» అధ్వానంగా మారిన సోమునాయుడుపాలెం-మూల స్వయంభూవరం రోడ్డు
» రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
» ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు


సోమునాయుడుపాలెం వద్ద రాళ్లు తేలిన రహదారి


స్వయంభూవరం సమీపంలో దుస్థితి

పరవాడ, జూన్ 16: మండలంలోని సోమునాయుడుపాలెం నుంచి మూల స్వయంభూవరం మీదుగా కలపాక వెళ్లే రహదారి దారుణంగా మారింది. ఎక్కడికక్కడ గుంతలు పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండా సోమునాయుడుపాలెం, మూల స్వయంభూవరం, స్వయంభూవరం, కలపాక గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, వాహనదారులు నిత్యం వెళ్లి వస్తుంటారు. రహదారి శిథిలమై ఏళ్ల గడుస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడు లేకపోయారు. దీనికితోడు ఇరువైపులా ముళ్లపొదలు కారణంగా రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముళ్లపొదల కారణంగా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి రహదారికి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే హడలిపోవాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూ లైన్లలో కోలాహలం


అనకాపల్లి టౌన్, జూన్ 16 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక ఆరంభమైంది. ఆరు గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలు కల్పించారు. భక్తులతో క్యూ లైన్లు కిటకిటలాడాయి. ఆలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంత కొబ్బరితోటల్లో భక్తులు వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా భక్తుల తాకిడి తగ్గలేదు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఆలయ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రంగురాళ్ల క్వారీ పరిశీలించిన పోలీసులు


ఆరిలోవలో క్వారీని పరిశీలించిన ఎస్ఐ కృష్ణారావు

గొలుగొండ, జూన్ 16 : అటవీప్రాంతలో రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు జరిపిన క్వారీని ఎస్ఐ కృష్ణారావు ఆదివారం పరిశీలించారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్లతో కూడిన మట్టిని గుట్టుగా శుక్రవారం రాత్రి తవ్వకాలు జరిగాయని పలు పత్రికల్లో వచ్చిన కథనాలు రావడంతో పోలీసులు స్పందించారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ధన్వంతరీ వనం ప్లాంటేషన్ వద్ద రంగురాళ్ల క్వారీలో గుర్తు తెలియని వ్యక్తులు రంగురాళ్ల తవ్వకాలు జరిపినట్లు ప్రచారం జరిగింది. దీంతో సుమారు రెండు లక్షల రూపాయల విలువల గల రంగురాళ్లు లభ్యమైనట్లు మండలంలోని జోరుగా ప్రసారం సాగుతోంది. రంగురాళ్లను నర్సీపట్నంలో వ్యాపారులు విక్రయాలు జరిగినట్లు ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడడంతో కొంతమంది రంగురాళ్ల తవ్వకాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. క్వారీని పరిశీలించిన అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ.. కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. దీంతో అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిలకడగా కోనాం జలాశయం నీటిమట్టం


కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ, జూన్ 16: మండలంలో కోనాం జలాశయంలో ఉన్న నీటి మట్టం నిలకడగా ఉంది జలాశయం గరిష్ఠ నీటి మట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం ఉదయానికి 95.60 మీటర్లకు చేరుకుంది. కోనాం జలాశయం ఎగువ నుంచి 70 క్యూసెక్కుల నీరు వస్తుండగా దిగువ కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీరు లీకేజీ రూపంలో వృథాగా పోతోంది. గత ఏడాది ఇదే రోజున 95.20 మీటర్లు నీటిమట్టం ఉందని ఏఈ జయరాం తెలిపారు.

కోనాంలో ఆరు అడుగుల నాగజెర్రి హతం


స్థానికులు హతమార్చిన నాగజెర్రి

చీడికాడ, జూన్ 16: కోనాం గ్రామంలో గల చెక్ పోస్టు వద్ద ఆరు అడుగుల నాగజెర్రిని గ్రామస్థులు హత మార్చారు. చుట్టూ మను షులు ఉన్న సమయంలో వేరొక చోట నుంచి రోడ్డు మీదుగా ఆరు అడుగుల నాగజెర్రి ఆదివారం మధ్యాహ్నం హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనతో కర్రలతో కొట్టి హతమార్చారు. ఇది సుమారు ఆరు అడుగులు ఉంటుందని అంచనా వేశారు.

కొండకర్ల ఆవ వద్ద 'తండేల్' షూటింగ్ సందడి

» నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా పలు సన్నివేశాలు చిత్రీకరణ

అచ్యుతాపురం రూరల్, జూన్ 16: మండలంలోని కొండకర్ల ఆవ వద్ద ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నాగచైతన్య, సాయి పల్లవి హీరో, హీరోయిన్లుగా తెరకెక్కిస్తున్న 'తండేల్' చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కించారు. 2018లో శ్రీకాకుళం మత్స్యకారులకు జరిగిన సంఘటనను సినిమాగా చిత్రీకరిస్తున్నారు. గుజరాత్ రాష్ట్రం నుంచి చేపల వేట కోసం బయల్దేరిన 22 మంది శ్రీకాకుళం మత్స్యకారులు పాకిస్తాన్ సముద్ర సరిహద్దుల్లో అధికారులకు చిక్కి 17 నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించిన వారి జీవిత కథ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని కథా రచయిత కార్తీక్ తీడ తెలిపారు. గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే 70 శాతం పూర్తయిందన్నారు. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా డిసెంబరు 20న విడుదల కానుందన్నారు షూటింగ్‌ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పరిసర గ్రామాల నుంచి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

▸▸ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు పెద్దపీట

▸▸ విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



పెదపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 16 : రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత మొట్టమొదటి సారిగా పెదపాడులో ఆదివారం జరిగిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని విధాలా మేలు జరిగిందన్నారు. వైసీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటే తప్ప, ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్నిదాతలకు అన్నివిధాలా మంచి జరుగుతుందన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి తనను మెజారిటీతో ఓటర్లందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందడమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆయన పెదపాడులోని శివాలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాజాన రమేష్‌కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, ధూళి రంగనాయకులు, జనపరెడ్డి నర్సింగరావు, బైలపూడి శ్రీరామదాసు, మోటూరు త్రివేణి, దిన్‌బాబు, పవన్, విజయ్, పీలా తులసీరామ్, గిరి రాజు, పీలా సందీప్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడ అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలను పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రణాళిక లేకపోవడంతో పాటు పంచాయతీల నిధులు ప్రభుత్వం స్వాహా చేయడంతో సర్పంచ్‌లు పారిశుధ్య పనులు చేయలేక పోయారన్నారు. ఇక్కడ ముందుగా వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటుచేసి కాలువల్లో చెత్తవేయకుండా నిరోధించే ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడు బాబు (డ్రీమ్స్ నాయుడు), పుర్రే శ్రీనివాస యాదవ్, లాలం సత్తిబాబు, కూండ్రపు రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఒత్తిళ్ల వల్లే రాజీనామాలు

▸▸ మళ్లీ విధుల్లోకి తీసుకోండి ▸▸ ఎమ్మెల్యేను కోరిన మాజీ వలంటీర్లు

▸▸ పాలసీ మేటర్ అన్న విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 15: ఎన్నికల ముందు వైసీపీ నాయకుల తీవ్ర ఒత్తిళ్ల వల్ల తాము రాజీనామా చేశామని, ప్రస్తుతం తమకు తిరిగి ఉపాధి కల్పించాలని ఎలమంచిలికి చెందిన మాజీ వలంటీర్లు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కోరారు. మండలంలోని పెదపాడు గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను వారు కలిసి మాట్లాడారు. తమ ప్రమేయం లేకుండానే రాజీనామా పత్రాలను వైసీపీ నాయకులు తయారుచేసి, తమ తరపున రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారని వారు ఆరోపించారు. సదరు నాయకులకు భయపడే తాము అలా చేశామే తప్ప, కావాలని కాదని వివరించారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు రాజీనామాలు చేయవద్దని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.పదివేలు వేతనం ఇస్తామని ప్రకటించినా వినకుండా రాజీనామాలు చేశారన్నారు. ఇది పాలసీ మేటర్ అని, ప్రభుత్వానిదే తుది నిర్ణయం అని స్పష్టం చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



శ్రీనివాస్ (ఫైల్)

కశింకోట, జూన్ 16 : మండలంలోని బంగారయ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఆయన అందించిన వివరాలివి. బంగారయ్యపేటకు చెందిన అంద్ర శ్రీనివాస్ అచ్యుతాపురంలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఈనెల 13వ తేదీన ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి కంపెనీకి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఎలమంచిలికి వెళ్ళాడు. అక్కడి నుంచి కంపెనీకి చెందిన బస్సులో విధులకు వెళ్ళి తిరిగి సాయంత్రం 5.10 నిముషాలకు కంపెనీ నుంచి ఎలమంచిలి వచ్చేశాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో ఆయన భర్త పద్మావతి ఫిర్యాదు చేసినట్టు హెచ్‌సీ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కూరలు కరువు.. ధరల దరువు

▸▸ దిగుబడి తక్కువ.. డిమాండ్ ఎక్కువ

▸▸ రోజు రోజుకు దూసుకుపోతున్న రేట్లు

▸▸ గత పక్షం రోజులతో పోల్చి చూస్తే పెరుగుదల

▸▸ ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు



అనకాపల్లి టౌన్, జూన్ 16 : కూరగాయలు కొనాలంటేనే జనం హడలిపోతున్నారు. మార్కెట్‌లో అడుగుపెట్టే పేద, మధ్యతరగతి ప్రజలకు వాటి ధర వింటేనే గుండె దడ పుడుతోంది. పక్షం రోజులతో పోల్చితే ఎన్నడూ లేనివిధంగా ధరలు పెరిగాయి. ప్రస్తుతం అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు అతి తక్కువగా వస్తున్నాయి. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధరలకు రెక్కలొచ్చాయి. ఇతర జిల్లాల్లో దిగుబడులు భారీగా పడిపోవడంతో అంతంత మాత్రంగానే కూరగాయలు అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతున్నాయి. దీంతో రవాణా చార్జీలన్నీ కలుపుకుంటే ధరలు భారం పెరుగుతోంది. ఉల్లిపాయలు పదిహేను రోజుల క్రితం కిలో రూ.30 ఉండగా ప్రస్తుతం రూ.40 ధర పలుకుతుంది. వంకాయలు రూ.40 నుంచి రూ.50, దొండకాయలు రూ.30 నుంచి రూ.40, బెండకాయలు రూ.40 నుంచి రూ. 50లు, క్యాబేజీ రూ.30 నుంచి రూ. 40, చేమదుంపలు రూ.40 నుంచి రూ.50గా ఉన్నాయి. టమోటా రూ. 40 ఉండగా ప్రస్తుతం రకాన్ని బట్టి రూ. 60 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. ప్రస్తుతం అనకాపల్లి మార్కెట్‌కు టమోటాలు మదనపల్లి, పుంగనూరు ప్రాంతాల నుంచి వస్తున్నాయి. అయితే అక్కడ దిగుబడులు తగ్గడంతో ధరలు కూడా పెరగడం, రవాణా చార్జీలు కలిపితే ధర అధికమౌతోందని వర్తకులు చెబుతున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.70 కొనసాగుతోంది. ఇదే పచ్చిమిర్చి బజ్జీల తయారీకి ఉపయోగించే మిరపకాయలు కిలో రూ.90 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. అల్లం ధర పదిహేను రోజుల క్రితం మాదిరిగానే రూ.200లు ఉంది. రాజమండ్రి సమీపంలోని మడిక, రావులపాలెం నుంచి కూరగాయలు వస్తుండగా, పచ్చిమిర్చి ఏలూరు, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాల నుంచి అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతుంది. స్థానికంగా వంకాయలు, గోరుచిక్కుడు, బీరకాయలు కూడా రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నా అంతంత మాత్రంగానే సరుకు రావడం వల్ల డిమాండ్ పెరగడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికే పప్పు, ఉప్పులు, నూనెలు, బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నా తరుణంలో కూరగాయల ధరలు కూడా పెరగడంతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలావుంటే, మార్కెట్‌కు ఉదయాన్నే రైతులు కూరగాయలు తెచ్చిన తరువాత చిల్లర వర్తకులు అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. తిరిగి వాటిని ఆయా గ్రామాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనా టమోటా, ఉల్లిపాయల ధరలు రోజు రోజుకి పెరుగుతుండడం సామాన్య, మధ్యతరగతికి ఇబ్బందులు తప్పడం లేదు.

నెల రోజుల్లో జల్లూరు వంతెన పూర్తి

▸▸ తక్షణమే పనులు ప్రారంభించండి ▸▸ అవసరమైతే నిధులు ఇస్తా.. ▸▸ ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు ఎంపీ సీఎం రమేష్ ఆదేశం



జల్లూరు వంతెన పరిశీలనకు వచ్చిన ఎంపీ సీఎం రమేష్, ఇతర నాయకులు

కోటవురట్ల, జూన్ 16 : నెల రోజుల్లోగా జల్లూరు వంతెన నిర్మాణ పనులు పూర్తిచేయాలి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల గురించి ఆలోచించకుండా అవసరమైతే ఎంపీ నిధులనుంచి ఇస్తానన్నారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి తనకు కబురు చేయాలని సూచించారు. మండలంలోని జల్లూరు వంతెనను ఆదివారం సాయంత్రం అధికార యంత్రాంగం, బ్రిడ్జి కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. పనులు నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. 2018లో ఈ వంతెన పనులు ప్రారంభించగా, 2019 నాటికి పిల్లర్ల వరకు పూర్తిచేయడం జరిగిందని అధికారులు ఆయనకు వివరించారు. నాటి నుంచి మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ మాట్లాడుతూ 2019 నుంచి రూ.62లక్షల వరకు బకాయిలు పెండింగ్ ఉన్నాయన్నారు. ఇన్నేళ్లుగా వాహదారుల ఇబ్బందులు వైసీపీ ప్రభుత్వానికి కనిపించలేదా.. అని ఎంపీ ప్రశ్నించారు. ఇంత వరకు ఈ పనులను స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వంతెన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి లేదా సీఎస్ఆర్ గ్రాంట్ నుంచిమంజూరు చేయడం జరుగుతున్నారు. వంతెన పనులు రేపటి నుంచి ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఎంపీ ఆదేశించారు. నెలరోజులలోగా వంతెన పూర్తిచేస్తే ప్రారంభోత్సవానికి వస్తానన్నారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల దుస్థితి అధ్వానంగా ఉన్నాయన్నారు. ఎంపీ వెంట జనసేన పార్టీ నాయకులు గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు, టీకేపల్లి సర్పంచ్ పెట్లలింగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ



అనితను అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



ఎమ్మెల్యే అయ్యన్నను సన్మానిస్తున్న ప్రగడ



కొణతాలను సత్కరిస్తున్న బుద్ధ, నారాయణరావు



కొణతాలను సత్కరిస్తున్న దాడి

అచ్యుతాపురం, జూన్ 16 : ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు మండలంలోని పలువురు కూటమి నాయకులు ఆదివారం పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు రాష్ట్ర సైనిక్ సెల్ కో-ఆర్డినేటర్ అగ్గాల హనుమంతరావు అనకాపల్లిలో సన్మానించారు. మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్న పాత్రుడ్ని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కలిసి సత్కరించారు. హోంమంత్రి వంగల పూడి అనితను అనకాపల్లి జిల్లా పార్లమెంట్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కట్టెంపూడి సతీష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం సంతబయలు వద్ద ఉన్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం విచ్చేసి దాడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత కొణతాల విజయవాడ వెళ్ళి తిరిగి ఆదివారం అనకాపల్లికి వచ్చి దాడి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా కొణతాలను దాడి కుటుంబీకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌ను కొణతాల సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, దాడి అభిమానులు విల్లూరి రాము, మధుబాబు, మళ్ల రాజా, కొణతాల రాజేంద్ర, కోటిపల్లి జేజిబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : హోం మంత్రి వంగలపూడి అనితను ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేవీఎస్ ధర్మారావు ఆధ్వర్యంలో ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు చెందిన పలువురు ఫెడరేషన్ ప్రతినిధులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్లినట్టు ధర్మారావు ఇక్కడి విలేకరులకు తెలిపారు.

కొత్తూరు : కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు బాధ్యతతో కూడిన సేవలు అందిద్దామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. బీజేపీ కార్యాలయంలో కొణతాలను ఆ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పార్టీలూ ఎప్పుడూ కలిసి కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, ఓబీసీ నాయకులు కర్రి రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొణతాల రామకృష్ణ, ఈ విజయానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావులను ఉపాధ్యాయ సంఘాలు, విశ్రాంత ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆదివారం ఇక్కడ సత్కరించారు. కొణతాల రామకృష్ణకు తమ సమస్యలను వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో శిష్ట్లా, తమ్మిరాజు, శివరామకృష్ణ, వరం, శంకరబాబు, బాబ్జీ, పీఆర్వీ మహేష్, గంట్ల కృష్ణ, అప్పారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన కొణతాల రామకృష్ణ మొట్ట మొదటిసారిగా అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయానికి ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు కలిసి గజమాలతో సత్కరించారు.

‘ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం’



ఎమ్మెల్సీకి వినతిని అందిస్తున్న సంఘాల ప్రతినిధులు

కొత్తూరు, జూన్ 16 : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీకి బదిలీ అయిన సుమారు 350 మంది ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయనను ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి వారు ఎదుర్కొం టున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సైవిధంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డి.గోపీనాథ్, పి.గణపతి, కె.ఉమామహేశ్వరరావు, గంట్ల కృష్ణ, మహేష్, తులసీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు సందడి



పాఠశాలలో కలుసుకున్న 1983-84 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఎలమంచిలి, జూన్ 16 : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వీరంతా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఏఎంసీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రేఖా వీరభద్రరావు, ఎస్ఎస్‌వీఎస్‌రాజు, ఎస్.సుబ్రహ్మణ్యం, ఏవీహెచ్ శాస్త్రి, హిమశేఖర్, వేగి వెంకటరావు, శారద, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

నక్కపల్లి, జూన్ 16 : మండల కేంద్రం నక్కపల్లికి చెందిన కర్రి శ్రీను (26) అనే గీత కార్మికుడు ఆదివారం చెట్టుపై కల్లుతీస్తుండగా ప్రమాదవ శాత్తూ జారిపడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కుగా వున్న శ్రీను మృతితో అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యులను కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు, పెద్దలు పరామర్శించారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీ సీజ్

లంకెలపాలెం, జూన్ 16 : పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని గనుల శాఖ అధికారులు పట్టుకొని పరవాడ పోలీసులకు అప్పగించారు. ముందుగా అందిన సమాచారం మేరకు గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి సిబ్బందితో కలిసి ఆదివారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని పట్టుకున్నారు.

కట్టుబోలులో నవదుర్గామాతకు పూజలు



రాంబిల్లి, జూన్ 16 : మండలంలోని కొట్టుబోలు గ్రామంలో ఆదివారం నవదుర్గామాత ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న పాదయాత్ర భక్తులకు సంఘీభావం

ఎలమంచిలి, జూన్ 16 : రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మొక్కుకుని పోతిరెడ్డిపాలెం నుంచి సింహాచలం దేవస్థానానికి మొక్కు చెల్లించుకునేందుకు పాదయాత్రగా వెళుతున్న టీడీపీ నేత ఇత్తంశెట్టి సన్యాసినాయుడు తదితరులకు పినగాడి జంక్షన్ వద్ద ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ నాయకుడు గండి బాబ్జీ ఆదివారం సంఘీభావం తెలిపారు.

‘పేట’లో అన్న క్యాంటీన్‌పై ఆశలు!



పిల్లర్ల స్థాయిలో నిలిచిన అన్న క్యాంటీన్ పనులు

పాయకరావుపేట, జూన్ 16 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటిగా సంతకాలు చేసిన ఐదు ఫైళ్లలో రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ కూడా ఉండడంతో పాయకరావుపేటలో ఐదున్నరేళ్ల క్రితం అర్ధంతరంగా ఆగిపోయిన ఈ క్యాంటిన్ ఏర్పాటుకు ఇప్పుడు మోక్షం కలుగనుంది. రాష్ట్రంలో పేదలకు రూ.5కే రుచికరమైన భోజనం పెట్టాలన్న లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. కొన్నిచోట్ల విజయవంతంగా కొనసాగేవి. 2019 ఫిబ్రవరిలో పాయకరావుపేట పట్టణంలోని అరటిగెలల మార్కెట్ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే వంగలపూడి అనిత నిర్ణయించి, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నెల రోజుల్లో భవన నిర్మాణం పూర్తయి క్యాంటీన్ ప్రారంభం కావాలని అధికారులు నిర్ణయించినప్పటికీ పనులు జాప్యమయ్యాయి. ఆఏడాది ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఈ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అనంతరం రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను సదరు ప్రభుత్వం రద్దు చేయడంతో పాయకరావుపేటలో సగంలో ఆగిన క్యాంటీన్ నిర్మాణాన్ని గడచిన ఐదేళ్లుగా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు రూపొందించిన ఫైలుపై సీఎం సంతకం చేశారు. దీంతో పాయకరావుపేటలో అన్న క్యాంటీన్ ఏర్పాటై పేదలకు అతి తక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి రానుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగదుర్గమ్మ జయంతి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్, జూన్ 16 : ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయంలో నాగదుర్గమ్మ జయంతిని ఆది వారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మ వారికి పూజలు జరిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీశెట్టి తాతారావు, పీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారామచంద్ర ఆలయ వార్షికోత్సవం

పాయకరావుపేట రూరల్, జూన్16 : సత్యవరం ఎస్సీకాలనీలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయం ఐదో వార్షికోత్సం సోమవారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఫాదర్స్‌డే సందర్భంగా యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

అనకాపల్లిటౌన్, జూన్ 16 : ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో ఆదివారం ఫాదర్స్‌డే సందర్భంగా లోటస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో యువకులు రక్తదానం చేశారు. డాక్టర్ వై.డి.ఎస్.మూర్తి, ఎస్‌డీ గ్రూపు అధినేత కాండ్రేగుల శ్రీరామ్, గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, మారిశెట్టి భాస్కరరావు, విల్లూరి రాజేష్, ఆళ్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పాల సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవ ఎన్నిక

సబ్బవరం, జూన్ 16 : పైడివాడలో విశాఖ డెయిరీకి పాలు పోసే రైతులు ఆదివారం ఇద్దరు డైరెక్టర్లును ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. పాల సొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేయగా, వారి స్థానంలో పాడి రైతులు దాసరి ప్రసాద్, బొబ్బరి పెంటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దాసరి అక్కునాయుడు, రామునాయుడు, వడ్డాది పెంటయ్య, అల్లమల్ల సురేశ్, కోమటి రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్య రక్షణపై సెమినార్

నక్కపల్లి, జూన్ 16 : మండలంలోని డొంకాడలో ఆదివారం తుని రోటరీ క్లబ్, ఉపాధ్యాయులు శర్మ ఆధ్వర్యంలో ‘నేటి సమాజంలో బాలికల ఆరోగ్య పరిరక్షణ’పై సెమినార్ నిర్వహించారు. మోటివేషనల్ ట్రైన్ సుమ, డాక్టర్ హరిలు బాలికల ఆరోగ్యం ఇతర అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కె.కిశోర్ రెడ్డి, ఎస్.వీర్రాజు, డాక్టర్ పి.ప్రసాద్, ఎం.వివేకానంద్, పొన్నాడ శ్రీనివాస్, కృష్ణ, రమేశ్, సీత, శ్యామల, హర్షిత పాల్గొన్నారు

యోగాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న జోగినాయుడు

అనకాపల్లిటౌన్, జూన్ 16 : భారత స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో యోగాపై ఆదివారం పట్టణంలోని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని తొలుత జార్జిక్లబ్ నుంచి క్లబ్ అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. జి. మంగయ్య, కాండ్రేగుల చిన్న, కేవీవీ సత్యనారాయణ, కర్రి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి ప్రశంసలు

ఎలమంచిలి, జూన్ 16 : పురుషోత్తపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గంజి హైమావతి పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించినందుకు గాను ఆదివారం అనకాపల్లిలోని జరిగిన కార్యక్రమంలో ఆమెకు ప్రోత్సాహక బహుమతి అందించినట్టు ఉపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు. కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు చేతులు మీదుగా విద్యార్థిని మెమెంటో అందుకున్నట్టు చెప్పారు.

మహిళా భద్రతకు పెద్దపీట

... 3వ పేజీ తరువాయి

అవసరం ఉందని తెలిపారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులను కలెక్టర్.. మంత్రి అనితకు పరిచయం చేశారు. అలాగే పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిచయం చేయడంతో అధికారులంతా మంత్రిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు. మంత్రి అనితను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఘనంగా సత్కరించి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ప్రైవేటు పాఠశాలల దందా!

... 3వ పేజీ తరువాయి

ఐదు ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేశారు. పాఠశాల ఆవరణలో పుస్తకాలు విక్రయిస్తుండడంతో పుస్తకాలు ఉంచిన గదులకు తాళాలు వేశారు. అయితే వెంటనే ప్రైవేటు పాఠశాలల స్టేట్ యూనియన్ ప్రెసిడెంట్ నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినట్టు ఎంఈవో ‘ఆంధ్రజ్యోతి’కి చెప్పారు. కొత్త జీవో ప్రకారం ఫీజులు పెంచుకునే అధికారం తమకుందని చెప్పారని ఆయన తెలిపారు. కాగా ప్రైవేటు పాఠశాలల్లో చాలా ఘోరంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతా కృష్ణ తెలిపారు. అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాలపై ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా దర్నా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు



ఎల్ఎన్ పురంలో తాగు నీటి పథకానికి భూమి పూజ చేస్తున్న కేఎస్ఎన్ రాజు

రావికమతం, జూన్ 16 : ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని చోడవరం ఎమ్మెల్యేగా గెలిచిన కేఎస్ఎన్ రాజు అధికారులకు ఆదేశించారు. తట్టబంద పంచాయతీ శివారు ఎల్ఎన్ పురం, బూరుగుపాలెం, బల్లి పాలెం గ్రామాలలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.95 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికి కుళాయిల పథకానికి ఆదివారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన సామగ్రి వాడడం ద్వారా ఈ పథకం ఉద్దేశాన్ని పరిపూర్ణం చేయాలని సూచించారు. ఈ పరిసర గ్రామాల ప్రజల నుంచి ఎన్నడూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలన్నారు. ఇందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు.

చోడవరం ఎమ్మెల్యేగా మూడోసారి గెలిచి తమ పంచాయతీకి తొలిసారిగా విచ్చేసిన ఎమ్మెల్యే రాజును తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, చినపాచిల ఉప సర్పంచ్ కోమటి శంకరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం కేబీపీ అగ్రహారం పంచాయతీ శివారు యర్రబంద గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మతల్లి పండగ మహోత్సవంలో పాల్గొన్న రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించారు. అలాగే కొమిరలో కూటమి కార్యకర్తలు ఏర్పాటు చేసిన మహా అన్నదానంలో పాల్గొన్నారు.

గాదిరాయిలో వైభవంగా మోదకొండమ్మ పండుగ



గాదిరాయి గ్రామస్థులతో బండారు సత్యనారాయణ

మాడుగుల రూరల్, జూన్ 16 : మండలంలోని గాదిరాయి గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి విచ్చేసి అమ్మవార్ని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, అనపరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన అపరాలు



శరభవరంలో నీట మునిగిన పెసర పంట

రోలుగుంట, జూన్ 16 : గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఆయా గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని శరభవరం గ్రామంలో రైతులు పెసర, మినుము, ఇతర వాణిజ్య పంటలను సాగు చేశారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి అవన్నీ నీట మునిగాయి. దీంతో వీటికి తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా ఖరీఫ్ సాగుకు ముందు అపరాల సాగుతో మంచి లాభాలు పొందేవారని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాల దెబ్బకు పంట నష్టం తప్పేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ఘనంగా మోదకొండమ్మకు సారె



ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకొని వెళ్తున్న మోదమాంబ కాలనీ వాసులు

మాడుగుల, జూన్ 16 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం శ్రీమాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి స్థానిక మోదమాంబ కాలనీవాసులు ఆదివారం వివిధ రకాల పిండివంటలు, ఫలాలతో సారెను మోదకొండమ్మ అమ్మవారికి సమర్పించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం అమ్మవారి జాతరకు నెల రోజుల ముందు అమ్మవారిని పాదాలు, ఘటాలను స్థానిక శతకంపట్టు వద్ద కొలువు ఉంచుతారు. ఈ నేపథ్యంలో కొలువున్న అమ్మవారికి బూరెలు, అరిసెలు, పొంగడాలు, లడ్డూ, కాజా వంటి వివిధ రకాల సంప్రదాయ పిండివంటలతో పాటు మామిడి, జామ వంటి వివిధ ఫలాలు.., చీర, జాకెట్టు, గాజుల సారెతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమలు అందించారు. అలాగే మాడుగుల బస్టాండ్ ప్రాంతాకి చెందిన భక్తులు కూడా అమ్మవారికి సారె అందించారు.

మోదకొండమ్మ అమ్మవారి దీక్షలు విరమణ



భక్తులకు ఇరుముడి కడుతున్న గురుమాత

మాడుగుల, జూన్ 16 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం శ్రీమాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా మాలధారణ చేసిన భక్తులు ఆదివారం రాత్రి దీక్ష విరమించారు. ఇందుకు సంబంధించి గురుమాతలు దర్శిశెట్టి నాయుడు, భత్తుల మూర్తిలు ఇరుముడి కట్టారు. ఉదయం నుంచి ఉపవాసంతో ఉన్న మోదకొండమ్మ మాతలకు స్థానిక శతకంపట్టు వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం భక్తులకు ఇరుముడి కట్టారు. అనంతరం సాయంత్రం 7 గంటల నుంచి గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపుగా భజన పాటలతో తిరిగి ఆలయానికి చేరుకొన్నారు. రాత్రి 12 గంటల దాటిన తరువాత దీక్షలు విరమించారు. దీక్ష విరమించిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అసంపూర్తిగా నిర్మాణాలు.. అద్దె భవనాల్లోనే కార్యాలయాలు

» ముందుకు సాగని గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు



అద్దె భవనంలో నడుస్తున్న గ్రామ సచివాలయం

బుచ్చెయ్యపేట, జూన్ 16 : బుచ్చెయ్యపేటలో గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల భవనాలు నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ప్రవాహసంగా సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రజలకు పాలన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ, దీనికి అనుబంధంగా రైతు భరోసా (ఆర్బీకె) కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. వీటికి సొంత భవనాలు ఉండాలన్న లక్ష్యం మేరకు బుచ్చెయ్యపేటలో 2021లో గ్రామ సచివాలయ భవనానికి రూ.42 లక్షలు, ఆర్బీకె భవనానికి రూ.22 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. అయితే ఈ మూడేళ్లుగా పనులు నత్తనడకగా సాగాయి. ప్రస్తుతం గ్రామ సచివాలయాలు, ఆర్బీకె భవనాలు శ్లాబ్ దశను పూర్తి చేసుకున్నాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేపట్టాల్సి ఉంది. నిర్మాణ పనులకు బిల్లులు మంజూరు చేసినా పనులు పూర్తి కావడం లేదు.

అన్ని ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ సేవలను ఒకే చోట వికేంద్రకరించడానికి 2019లో గ్రామ సచివాలయం వ్యవస్థను తీసుకొచ్చారు. అప్పటి నుంచి గ్రామ సచివాలయాన్ని అరకొర సౌకర్యాలు కలిగిన ఒక ప్రైవేటు భవనంలో అద్దె ప్రాతిపదికపై కొనసాగిస్తున్నారు. అన్ని ప్రభుత్వ సేవలు అందించడానికి తగిన మౌలిక సదుపాయాలు అద్దె భవనంలో లేకపోవడంతో సచివాలయాల ఉద్యోగులతో పాటు ప్రజలు ఇ



నిర్మాణ దశలోనే గ్రామ సచివాలయం



మూడేళ్లయినా పూర్తి కాని ఆర్బీకే భవనం

బ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్బీకె సేవలను మండల ఏవో కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. మూడేళ్లుగా భవన నిర్మాణాలు ప్రవాసంగా సాగు...తుండటంతో అన్ని ప్రభుత్వశాఖల సేవలు, సంక్షేమ పథకాల సేవలు ఒకే చోట అందుబాటులో ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరికారిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సచివాలయ, ఆర్బీకె కేంద్రాల భవనాల నిర్మాణాలను సత్వరంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రిని కలిసిన బీజేవైఎం రాష్ట్ర ప్రదాధికారి సతీష్



నర్సీపట్నం అర్బన్ , జూన్ 16 : రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను బీజెవైఎం రాష్ట్ర ప్రదాధికారి అడిగర్ల సతీశ్ ఆదివారం వెలగపూడిలో శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని వెలగపూడిలో వైద్య ఆరోగ్యశాఖామంత్రిని కలిసి వైద్య ఆరోగ్య, విద్య సంబంధిత అంశాలపై చర్చించినట్లు సతీశ్ తెలిపారు. నర్సీపట్నం ఏరియా హాస్పటల్‌ను అభివృద్ధి చేయాలని కోరినట్లు సతీష్ విలేకరులకు తెలిపారు. నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో పూర్తి స్థాయి వైద్యులను నియమించాలని, 150 పడకల హాస్పిటల్‌ను రెండువందల పడకలుగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. బ్లడ్ బ్యాంకు అభివృద్ధి, కార్పొరేట్ హాస్పిటల్‌లో జరిగే వైద్యసేవలు అన్నీ ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించాలని కోరారు. త్వరలో నర్సీపట్నం పర్యటించి అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని సతీష్ విలేకరులకు తెలిపారు.

మాకవరపాలెంలో ఇసుకాసురులు

» అక్రమ తరలింపుపై నోరు మెదపని అధికారులు

మాకవరపాలెం, జూన్ 16 : సర్పానది నుంచి ఇసుకను పట్టపగలే తరలిస్తున్నా అధికారులు 'నిమ్మకు నీరెత్తినట్టుగా' వ్యవరిస్తున్నారు. ఇసుకకు మంచి గిరాకీ ఉండటంతో అక్రమ ఇసుక వ్యాపారస్తులు రెచ్చిపోతున్నారు. మండల కేంద్రం మాకవరపాలెంలో అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. గత పది రోజులు నుంచి మాకవరపాలెంలో ఉన్న సర్పానది నుంచి ట్రాక్టర్లుతో ఇసుకను దర్జాగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం ఐదు గంటల నుంచి 9 గంటల వరకూ ట్రాక్టరులో ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక లోడు 4 వేలు నుంచి 5 వేలు దర పలుకుతోంది. అలాగే టైరు బండి ఇసుక 1200 దర పలుకుతుండడంతో ఇసుక వ్యాపారం 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా



ట్రాక్టర్‌పై తరలిపోతున్న ఇసుక

కొనసాగుతోంది. ఇదే సమయంలో ఇసుకకు భారీగా ధర పలకడంతో భవన నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమ ఇసుక వ్యాపారాన్ని అరికట్టాలని స్థానికులు, భవన నిర్మాణదారులు కోరుతున్నారు.



దిబ్బపాలెంలో వీధులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

దిబ్బపాలెం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి : బండారు

చీడికాడ, జూన్ 16 : మండలంలో దిబ్బపాలెం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని దిబ్బపాలెంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆదివారం వచ్చిన ఆయన మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు పైలా ప్రసాదరావుతో కలిసి గ్రామంలో వీధులు, డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ అన్ని వీధుల్లోనూ డ్రైనేజీలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో మురుగునీరు పేరుకుపోయి ఉందన్నారు. భవిష్యత్తులో సీసీరోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. వారితో పాటు ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, కోనాం జలాశయం మాజీ చైర్మన్ గండి మునలినాయుడు, టీడీపీ నాయకులు గౌరీపట్టపు నానాజీ, జొన్న చిరంజీవి, మడగల అప్పన్న తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనాం జలాశయం గట్టుపై తుప్పలు తొలగింపు



జలాశయం వద్ద తుప్పలను తొలగిస్తున్న సిబ్బంది

చీడికాడ, జూన్ 16 : మండలంలో కోనాం జలాశయం గట్టుపై ఇరువైపులా ఉన్న తుప్పలను ఆదివారం నీటి పారుదలశాఖ సిబ్బంది బాషా, షేక్ రసూల్ పర్యవేక్షణలో తుప్పలను తొలగించారు. గట్టుపై దట్టంగా తుప్పలు పెరగడంతో కోనాం జలాశయానికి వచ్చే పర్యాటకులు ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ విషయమై స్పందించిన ఏఈ జయరాం తుప్పలను తొలగించాల్సిందిగా ఆదేశించినట్టు వారు తెలిపారు.

పాత రేషన్ విధానాన్ని కొనసాగించాలి

ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజుకు రేషన్ డీలర్ల వినతి



కేఎస్ఎన్ రాజును అభినందిస్తున్న రేషన్ డీలర్లు

రోలుగుంట, జూన్ 16 : పాత రేషన్ వ్యవస్థను పునరుద్ధరించి రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రోలుగుంట మండల రేషన్ డీలర్లు ఆదివారం చోడవరం ఎమ్మెల్యేగా గెలిచిన కె.ఎస్.ఎన్.రాజును కలిసి విన్నవించారు. కూటమి ప్రభుత్వం ఆఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన కెఎస్ఎన్ రాజును డీలర్ల యూనియన్ అధ్యక్షుడు గొల్లు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ షాపుల వద్దనే రేషన్ ఇచ్చే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నో ఏళ్లుగా రేషన్ వ్యవస్థపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం హయాంలో అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. మా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. పాత రేషన్ విధానాన్నే అమలు చేసేటట్లు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పోతు రాజు, శ్రీను సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ మండల అధ్యక్షుడిగా అప్పలనాయుడు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

దేవరాపల్లి, జూన్ 16 : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా పోతల చిన అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం స్థానిక వినాయక గుడి ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రొంగలి సత్యం, ట్రెజరర్‌గా బడబడల సత్యం, డి.వెంకటపతిరాజు, సహాయ కార్యదర్శిగా రంధి వెంకటరావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి చినకన్నబాబు, త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని, అన్వర్, వల్లి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న తాతయ్యబాబు తదితరులు

బుచ్చెయ్యపేట, జూన్ 16 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన బాధిత కుటుంబాలకు అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సేకరించిన నగదును ఆదివారం టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అందజేశారు. చనిపోయిన శీలం మధు భార్య ప్రసన్నకు రూ.1.10 లక్షలు, విసారపు సాయి భార్య శ్యామలకు రూ.1.10 లక్షలు పత్తి ప్రశాంత్ తల్లి పార్వతికి రూ.80 వేలు చొప్పున నగదును తాతయ్యబాబు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దొండా నరేష్, గిరిబాబు, రమేష్, నారాయణమూర్తి, నానాజీ, తలారి శంకరరావు, అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ పండుగ



నూకాలమ్మ అమ్మవారి దర్శించుకున్న విజయ్ తదితరులు

కృష్ణాదేవిపేట, జూన్ 16 : గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు పండుగ జరిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం, లింగంపేట, గవిరంపేట గ్రామాల్లో ప్రజలకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సీపట్నం మన్సిపల్ కౌన్సెలర్ చింతకాయల రాజేశ్, గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబును సీఎంను చేసేలా కూటమి గెలుపు కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మరిశా రమణ, గొలకొండ శ్రీకాంత్, తాతీలు, ప్రసాద్, సత్యనారాయణ, సూరిబాబు, గ్రామ ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దందా!

...3వ పేజీ తరువాయి

ఐదు ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేశారు. పాఠశాల ఆవరణలో పుస్తకాలు విక్రయిస్తుండడంతో పుస్తకాలు ఉంచిన గదులకు తాళాలు వేశారు. అయితే వెంటనే ప్రైవేటు పాఠశాలల స్టేట్ యూనియన్ ప్రెసిడెంట్ నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినట్టు ఎంఈవో 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కొత్త జీవో ప్రకారం ఫీజులు పెంచుకునే అధికారం తమకుందని చెప్పారని ఆయన తెలిపారు.

కాగా, ప్రైవేటు పాఠశాలల్లో చాలా ఘోరంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతా కృష్ణ తెలిపారు. అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాలపై ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

మహిళా భద్రతకు పెద్దపీట

...3వ పేజీ తరువాయి

అవసరం ఉందని తెలిపారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులను కలెక్టర్.. మంత్రి అనితకు పరిచయం చేశారు. అలాగే పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిచయం చేయడంతో అధికారులంతా మంత్రిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

మంత్రి అనితను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఘనంగా సత్కరించి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

☛ సంక్షిప్తంగా..

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక మహోత్సవాలు

మాడుగుల రూరల్, జూన్ 16 : మండలంలోని కేజేపురం జంక్షన్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 14 వార్షికోత్సవ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండరావు తెలిపారు.

సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఎదురు సన్నాహం, స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ, 19 బుధవారం తిరువీధి ఉత్సవం, 19 తేదీ గురువారం వసంతోత్సవం, నాగవల్లి, 22 పుష్పాంజలి, ఊంజల్‌సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని రామకొండరావు తెలిపారు. భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కార్యకర్తలతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సమావేశం

చోడవరం, జూన్ 16 : నియోజకవర్గంలోని కార్యకర్తలతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఈ నెల 17 సోమవారం సమావేశం కానున్నారు. సీఎం రమేష్‌తో సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనాయకులంతా హాజరు కావాలని టీడీపీ నేతలు కోరారు.

నేడు సింహాచలంలో మొక్కులు తీర్చనున్న టీడీపీ నేతలు

నాతవరం, జూన్ 16 : జూన్ 17న (సోమవారం) నాతవరం నుంచి సింహాచలం మొక్కులు తీర్చుకోవడానికి 100 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేపడుతున్నట్టు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు యర్రా కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పార్టీ అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు సీఎం కావాలని, అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం ఎమ్మెల్యేగా గెలవాలని సింహాచలం వరహాలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర ద్వారా వచ్చి మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. సోమవారం స్థానిక వినాయకుని ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి వంద మంది టీడీపీ వర్గీయులు సుమారు 90 కిలోమీటర్లు దూరంలో ఉన్న సింహాచలం వరహాలక్ష్మి నరసింహ ఆలయానికి పాదయాత్రతో వెళ్లి మొక్కులు తీర్చుకుంటామని కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. ఈ పాదయాత్రలో టీడీపీ ముఖ్యనాయకులు ఆదిరెడ్డి మాణిక్యం, శెట్టి నాయుడు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జుత్తాడలోని మూడు ఆలయాల్లో చోరీకి యత్నం

చోడవరం, జూన్ 16 : మండలంలోని జుత్తాడ పంచాయతీలో మూడుగుళ్లలో దొంగలు చోరీకి ప్రయత్నించారు. గ్రామంలోని నూకాలమ్మతల్లి, పట్టాలమ్మ తల్లి, ఆంజనేయ స్వామి గుడులలో తాళాలు విరగగొట్టి దొంగతనాలకు ప్రయత్నించారు. స్థానికుల అలికిడితో దొంగలు పారిపోయినట్టు చెపుతున్నారు. గుడులలో దొంగతనాలపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు.